# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...


విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 327 శుక్రవారం 2 ఆగస్టు 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## కాక రేపుతున్న బీజేపీ అధ్యక్ష పదవి

*రాష్ట్ర బీజేపీలో అధ్యక్ష పీఠం పంచాయితీ మరింత ముదురుతోంది బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై అంత చర్చ ఎందుకు?.. అధ్యక్ష పదవికి పార్టీలో కొత్తగా చేరిన నేతలు పనికి రారా..? పాత నేతలే ఉండాలనే రూల్ ఉందా..? రాష్ట్ర కార్యలయం దాటి ఢిల్లీ వినువీధుల్లో అధిష్టాన పెద్దలతో కుస్తీ పడుతోంది. అధ్యక్ష రేసులో నిన్నటి దాకా కొత్త పాత నేతల పేర్లు వినిపించాయి. నేడు అది వార్ వన్ సైడ్ అన్నట్టు కొత్త నేతల పేర్లే ఫోకస్ అవుతున్నాయి. అధ్యక్షపగ్గాలు చేపట్టడానికి మాకేం తక్కువ అన్నట్టు మొన్నటి దాకా అందరు పోటీ పడి ఎవరికి వారు పైరవీలు చేసుకోవడంలో బిజీబిజీగా ఉండిపోయారు. కానీ పాత కొత్త నేతల పంచాయితీ రాష్ట్ర బీజేపీలోనే కాదు ? ఢిల్లీ పెదలకు కూడా గందరగోళంగా తయారైన నేపథ్యంలో పాత బీజేపీ నేతలంతా డైలామాలో పడినట్లు తెలుస్తోంది*

-3లో





### ఇది మాటలకందని మహా విషాదం

- బాధితులను కలిసి వారితో రోజంతా గడిపాం
- ఇది మాటలకు అందని మహా విషాదం
- ప్రజల బాధలను చూసి చలించిపోయాం
- వయనాడ్‌లో పర్యటించిన రాహుల్, ప్రియాంక..

## కేసీఆర్‌కు రాజకీయ జీవితం
# ఇచ్చిందే కాంగ్రెస్

- బీఆర్ఎస్ నేతలు ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారు
- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఉద్దండులైన న్యాయవాదులతో వాదించేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని
- బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను నేను నా సొంత అక్కలుగానే భావించా
- బీఆర్ఎస్ నేతలకు దేవుడు జ్ఞానం ప్రసాదించాలి..
- "అక్కల క్షేమం కోరే చెబుతున్నా... వాళ్ల ఉచ్చులో పడొద్దు.
- 17 కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం
- అందుకే దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది



హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలు ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. హరీష్‌రావును కూడా గతంలో మంత్రిగా కాంగ్రెస్ చేయలేదా..? అని ప్రశ్నించారు. గురువారం నాడు తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఉద్దండులైన న్యాయవాదులతో వాదించేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను నేను నా సొంత అక్కలుగానే భావించా. సీతక్కపై సోషల్ మీడియాలో అవమానించేలా మీమ్స్ పెడుతున్నారు. ఆదివాసీ ఆడబిడ్డను అవమానించినట్లు కాదా..? సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా ఢిల్లీ వెళ్లి రాజకీయ ఒప్పందం చేసుకున్న నీచులు వారు. అక్కా మీరు వాళ్ల ఉచ్చులో పడొద్దు. మీ ముందు కింద - మిగతా3లో

## వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధులు



- జీహెచ్ఎంసీ పరిధిలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి
- ముఖ్యంగా చిన్న పిల్లలపై డెంగ్యూ ప్రభావం ఉన్నట్లు సమాచారం
- ఐదారు రోజులకు పరిస్థితి విషమిస్తుందని హెచ్చరిస్తున్నారు.
- నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ నివేదిక ప్రకారం తెలంగాణలో జులైలోనే 722 డెంగ్యూ కేసులు

## బ్యాంక్‌లో అక్రమాలు

బినామీల పేర్లతో రుణాలు..

ఈడీ సోదాల్లో విస్తుపోయే నిజాలు..

మహేష్ కో-ఆపరేటీవ్ బ్యాంకులో రూ.300 కోట్ల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం




హైదరాబాద్

మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. ఓసారి బ్యాంకు సర్వర్ హ్యాక్ చేసి సైబర్ నేరగాళ్లు కోట్లు కొట్టేస్తే.. ప్రస్తుతం బ్యాంకు అధికారులే అక్రమాలకు పాల్పడిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్‌లోని మహేష్ కో-ఆపరేటీవ్ బ్యాంకులో రూ.300 కోట్ల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండు రోజులుగా ఈడీ అధికారులు చేస్తున్న సోదాల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. బ్యాంక్ ఉద్యోగులు కుమ్మక్కై భారీ అక్రమాలకు - మిగతా3లో



### జులై 30న కేరళకు రెడ్ అలర్ట్ జారీ చేశాం

- ఐఎండీ చీఫ్ మహాపాత్ర
- వర్షాలకు సంబంధించి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడి
- ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లకూ హెచ్చరికలు జారీ చేశామన్న ఐఎండీ
- వాయనాడ్ ఘటనపై అమిత్ షా వర్సెస్ విజయన్ నేపథ్యంలో ప్రకటన

## నేడు అసెంబ్లీలో
# జాబ్ క్యాలెండర్

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం
- నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు
- తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీకి కేబినెట్ ఆమోదం
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర కేబినెట్
- ఉత్తమ్ అధ్యక్షతన కొత్త రేషన్ కార్డులపై కేబినెట్ సబ్ కమిటీ
- రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన పొంగులేటి



హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది నిర్దిష్టమైన కాల వ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు జాబ్ క్యాలెండర్‌ను కేబినేట్ ఆమోదించింది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ నెల 2వ తేదీన అసెంబ్లీ వేదికగా జాబ్ క్యాలెండర్ ప్రకటించబోతున్నట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. కేరళలో వయనాడ్‌లో భారీ వర్షాలతో పాటు కొండచరియలు విరిగిపడి చాలా మంది చనిపోయారు. కేరళలో జరిగిన విషాదంపై తెలంగాణ కేబినేట్ సంతాప తీర్మానం ఆమోదించింది. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేసింది. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు ముందుకు వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీతో పాటు రాష్ట్ర ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌తో హెల్త్ కార్డులను జారీ - మిగతా3లో

# వయసు మళ్లిన నేతలున్న రాజకీయ వ్యవస్థ ఇది

**ఢిల్లీ:** ప్రపంచంలో యువకులు అత్యధికంగా ఉన్నది భారత్‌లోనే. మరి వయస్సు పైబడిన వారు ఎక్కువగా ఉన్నది ఏ రంగంలో అంటే టక్కున గుర్తొచ్చేది రాజకీయాలే. ఇదే అంశాన్ని లేవనెత్తారు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా గురువారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థుల కనీస వయసు ప్రస్తుతం 25 ఏళ్లుగా ఉంది. "మన దేశంలో యువత ఎక్కువ సంఖ్యలో ఉంది. కానీ 35 ఏళ్ల కంటే తక్కువ వయసున్న జనాభా 65 శాతంగా ఉంది. 25 ఏళ్ల లోపువారు 50 శాతం ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నికైన లోక్‌సభలో 40 ఏళ్లలోపు వారు 26 శాతం మంది ఉన్నారు. ప్రస్తుత లోక్‌సభలో 12 శాతం మాత్రమే ఉన్నారు. వయసు మళ్లిన నేతలతో ఉన్న యువ



దేశం మనది. యువ నాయకులతో ఉన్న దేశంగా మారాలి. అందుకోసం కేంద్రానికి ఓ సూచన చేస్తున్నా. ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసు 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలి. అప్పుడే ప్రజాసమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయి" అని చద్దా పేర్కొన్నారు.

**సరదా సంభాషణ..**

రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కు రాఘవ్ చద్దాకు మధ్య సభలో ఆసక్తికర సంభాషణ జరిగింది. యువ వయసులో రాఘవ్ చద్దా(35) సమస్యలపై సభలో ప్రస్తావించడాన్ని జగదీప్ ధన్‌ఖర్ కొనియాడారు. దీనిపై సరదాగా స్పందించిన జగదీప్.. ఇంత చిన్న వయసులో లోక్‌సభలో అడుగుపెట్టాలనుకుంటున్నారా అని సరదాగా ప్రశ్నించారు. తనకు ముందునుంచే రాజకీయాలంటే ఆసక్తి ఎక్కువని.. యువత ఈ రంగాన్ని చెడు వృత్తిగా భావించి దూరంగా ఉంటోందని రాఘవ్ అన్నారు. యువత ధోరణిలో మార్పు వచ్చి చట్టసభల్లో వారి సంఖ్య పెరిగినప్పుడే దేశం మరింత జోరుగా అభివృద్ధిబాటలో పయనిస్తుందని చద్దా అభిప్రాయపడ్డారు.

# ఇది మాటలకందని మహా విషాదం

**తిరువనంతపురం:** వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాలను, స్థానికులను పరామర్శించిన అనంతరం కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతో కలిసి ఆ పార్టీ నేత ప్రియాంక గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బాధితులను కలిసి వారితో రోజంతా గడిపామని, ఇది మాటలకు అందని మహా విషాదమని చెప్పారు. ప్రజల బాధలను చూసి చలించిపోయామని, ఇక్కడి పరిస్థితి చూస్తుంటే వారెంతగా నలిగిపోయారో మనం ఊహించవచ్చని వ్యాఖ్యానించారు. బాధితులకు భరోసా, ధైర్యాన్ని ఇచ్చేందుకే తాము ఇక్కడకు వచ్చామని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ విపత్తు సంభవించిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఆప్తులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను ఎలా ఆదుకోవాలనే దానిపై తాము శుక్రవారం కూలంకషంగా చర్చిస్తామని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఇక కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య 288కి చేరుకుంది.



అయితే ప్రమాదానికి కేంద్ర స్థానమైన చూర్‌మలాలో అంతకుముందు గురువారం మధ్యాహ్నం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. మెప్పాడిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాధితులను కలుసుకున్నారు. అక్కడ నుంచి డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజీకి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన రెండు రిలీఫ్ క్యాంప్‌లను సందర్శించి బాధితులను పరామర్శించారు. రాహుల్, ప్రియాంకలతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారు.

కొండచరియలు విరిగిపడటంతో కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలోని రెండు గ్రామాలు తుడిచిపెట్టుకుపోవడంతో ఆత్మీయులను కోల్పోయిన బాధలో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారికి భరోసానివ్వడానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆగస్టు 1న వయనాడ్‌లో పర్యటించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వయనాడ్ పర్యటన వాయిదా పడిన ఒక రోజు తర్వాత రాహుల్, ప్రియాంక గురువారం మధ్యాహ్నం కేరళకు చేరుకున్నారు. ఇరువురు నేతలు కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలను సందర్శించారు. ఇరువురు ఉదయం 9.30కు కన్నూర్ విమానాశ్రయంలో దిగి రోడ్డు మార్గంలో వయనాడ్‌కు వెళ్లారు. మధ్యాహ్నానికి చూరల్‌మల చేరుకున్నారు. వీరి వెంట ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, అలప్పుజా ఎంపీ కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రదేశంతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజ్, మెప్పాడిలోని రెండు సహాయ శిబిరాలనూ సందర్శించారు.

చూరల్‌మలలో ఒక్కచోటే 250 మందికి పైగా మరణించగా.. 200 మంది గాయపడ్డారు. జులై 30 తెల్లవారుజామున వయనాడ్‌లోని ముండక్కై, చురల్‌మలలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి విధ్వంసం సృష్టించాయి. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మృతదేహాలపై పడ్డ బండరాళ్లను అడ్డుతొలగించడానికి యంత్రాలసాయంతో సహాయక చర్యలు చేపట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రాహుల్ గాంధీ 2024 ఎన్నికల్లో కూడా ఇక్కడి నుంచి మళ్లీ గెలుపొందారు. అయితే ఆయన గత ఎన్నికల్లో యూపీలోని రాయబరేలి నుంచీ పోటీ చేశారు. ఒక సీటును వదులుకోవాల్సి రావడంతో రాహుల్.. వయనాడ్ సీటుకి రాజీనామా చేశారు. ఈ ఎంపీ స్థానంలో ప్రియాంక గాంధీ పోటీ చేయాలని భావిస్తున్నారు.

**రెస్క్యూ సిబ్బందికి సవాళ్లు..**

కొండచరియలు విరిగిపడటంతో భారీ వృక్షాలు సైతం గ్రామాలపైకి వచ్చాయి. దీంతో వాటిని తొలగించేందుకు భారీ యంత్రాలు అవసరమని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. భారీ యంత్రాలతోనే సెర్చ్ ఆపరేషన్‌లో పురోగతి సాధించగలమని ఆయన అన్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, ఫైర్ అండ్ రెస్క్యూ, ఇతర బలగాలతో సహా 1,600 మందికి పైగా రెస్క్యూ వర్కర్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారని కేరళ రెవెన్యూ శాఖ మంత్రి రాజన్ తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీంకోర్టు కీలక తీర్పు



ఎస్సీ, ఎస్టీ కులాల రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నేడు కీలక తీర్పు వెలువరించింది. రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందంటూ తన తీర్పులో స్పష్టం చేసింది. విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ సమంజసమేనని ఉద్ఘాటించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదంటూ 2004లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం నేడు పక్కనబెట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఉపవర్గీకరణ చేయకూడదంటూ ఇచ్చిన నాటి తీర్పును కొట్టివేసింది. ఈ మేరకు సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 6:1 మెజారిటీతో తీర్పు వెలువరించింది. ఈ బెంచ్ లో, ఉపవర్గీకరణ సాధ్యం కాదంటూ ఒక్క జస్టిస్ బేలా త్రివేది మాత్రమే అభ్యంతరం తెలిపారు. ఉపవర్గీకరణకు సీజేఐ చంద్రచూడ్ తో పాటు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీశ్ చంద్ర, జస్టిస్ మనోజ్ మిశ్రా అనుకూలంగా తీర్పు ఇచ్చారు. సుప్రీం తీర్పును అనుసరించి రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై రాష్ట్రాలు మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సుప్రీం ధర్మాసనం సూచించింది. ఆ మార్గదర్శకాలు సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని నిర్దేశించింది.

# కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 01:** మరికొద్ది మాసాల్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనుంది. అలాంటి వేళ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎన్నికల్లో 35 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జ్‌ను నియమించింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో మహా వికాస్ అగాడి కూటమిలోని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి ఎన్నికలకు వెళ్తున్నాయి. దాంతో మహారాష్ట్రలోని మొత్తం 288 స్థానాలను గాను ఆ యా పార్టీలు సీట్లను పంచుకొని.. అభ్యర్థులను బరిలో నిలుపనున్నాయి. ఇంకోవైపు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో బుధవారం ఆ పార్టీలోని కీలక నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిత్ర పక్షాలతో సీట్లు పంపకాలు, అలాగే ఈ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఆగస్ట్ 7వ తేదీన మహారాష్ట్ర వికాస్ అగాడీలోని రాజకీయ పార్టీలన్నీ సమావేశమై.. సీట్ల అంశాన్ని ఒక కొలుక్కి తీసుకు వచ్చే అవకాశముందని సమాచారం. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్ట్ 20వ తేదీ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జన్మదినం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. ఈ ప్రచార కార్యక్రమంలో.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొనున్నారు. ఇక 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన పార్టీ 56, ఎన్సీపీ 54, కాంగ్రెస్ పార్టీలు 44 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఈ ఎన్నికల అనంతరం మహారాష్ట్రలో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. ఎన్సీపీ, శివసేన పార్టీలు నిట్ట నిలువునా చీలిపోయాయి. దీంతో మహాయుతి కూటమిగా శివసేన ఏకనాథ్ సారథ్యంలోని షిండే వర్గం, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ అధికారాన్ని చేపట్టాయి. అయితే ఈ సారి మాత్రం మహారాష్ట్ర ప్రజలు ఏ కూటమికి పట్టం కట్టతారనేది ఈ ఎన్నికల ఫలితాల అనంతరం తేటతెల్లం కానుంది.

## హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్.. భారీ భవనం ఎలా కొట్టుకుపోయిందో చూడండి!



హిమాచల్ ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో అకస్మాత్తుగా విరుచుకుపడిన కుంభవృష్టి బీభత్సం సృష్టిస్తోంది. క్లౌడ్ బరస్ట్ కారణంగా ఒకరు చనిపోగా, పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. సిమ్లా జిల్లా రాంపూర్ ప్రాంతంలో సమేజ్‌ఖాద్‌లోని హైడ్రోపవర్ ప్రాజెక్టు సమీపంలో క్లౌడ్ బరస్ట్ సంభవించింది. మరోవైపు, అకస్మాత్తు వరదల్లో కొట్టుకుపోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. క్లౌడ్ బరస్ట్ కారణంగా ఈ ఉదయం పార్వతి నది సమీపంలోని భవనం కొట్టుకుపోయింది. వరదల కారణంగా నదులు, వాగులు పొంగి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి.

## ఇళ్లకు తిరిగి వెళ్తామంటూ మణిపూర్‌లో నిర్వాసితుల నిరసన..

**టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించిన పోలీసులు**





**ఇంఫాల్:** తమ ఇళ్లకు తిరిగి వెళ్తామంటూ మణిపూర్‌లోని నిర్వాసితులు నిరసన చేపట్టారు. బ్యానర్లు, ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో నిరసనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్స్‌ను పోలీసులు ప్రయోగించారు. ఇంఫాల్ లోయలో ఆధిపత్యమున్న మైతీ, కొండ ప్రాంతాలకు చెందిన కుకీల మధ్య 2023 మేలో జాతి హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో మోరేలోని ఇళ్ల నుంచి పారిపోయిన నిర్వాసితులు ఇంఫాల్‌లోని అకంపత్‌లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారు. కాగా, ఏడాదికిపైగా కఠోర పరిస్థితుల్లో రిలీఫ్ క్యాంపుల్లో జీవిస్తున్న నిర్వాసితులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని భావిస్తున్నారు. దీని కోసం గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తమకు భద్రత కల్పించాలని, తాము పోగొట్టుకున్న వాటిని తిరిగి పొందేందుకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిర్వాసితులు ర్యాలీగా సీఎం బంగ్లా వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్స్‌ను ప్రయోగించారు. ఈ సంఘటనలో పది మంది నిర్వాసితులతోపాటు సమీపంలోని స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## జులై 30న కేరళకు రెడ్ అలర్ట్ జారీ చేశాం




కేరళకు జులై 30 తెల్లవారుజామున రెడ్ అలర్ట్‌ను ప్రకటించామని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వర్షాలకు సంబంధించి ఎప్పటికప్పుడు క్రమపద్ధతిలో సూచనలు... హెచ్చరికలు జారీ చేస్తూనే ఉందన్నారు. జులై 30న రెడ్ అలర్ట్ జారీ చేశామని, అదే రోజు కొండచరియలు విరిగిపడ్డాయన్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లకూ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా వాయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యం సంభవించే అవకాశముందని కేంద్రం హెచ్చరించినా కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న (జూలై 31) ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 30 ఉదయం వాయనాడ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వాయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యంపై కేంద్రం ముందే హెచ్చరించినట్లు అమిత్ షా తెలిపారు. అయితే వాతావరణ శాఖ కేవలం ఆరెంజ్ అలర్ట్ మాత్రమే జారీ చేసిందని సీఎం విజయన్ అన్నారు. ఈ నేపథ్యంలో ఐఎండీ చీఫ్ వివరణ ఇచ్చారు.

## లెబనాన్‌ను వీడండి...



లెబనాన్ పర్యటనకు రావొద్దంటూ అక్కడి భారత రాయబార కార్యాలయం నేడు భారత పౌరులకు హెచ్చరిక జారీ చేసింది. భారతీయులు ఎవరూ ఈ దేశానికి రావొద్దని సూచించింది. అలాగే లెబనాన్‌లో ఉన్న భారతీయులు కూడా వెళ్లిపోవాలని పేర్కొంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి వస్తే, అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ హెచ్చరికలు జారీ చేసింది. తదుపరి ప్రకటన వచ్చే వరకు భారతీయులు ఎవరూ లెబనాన్‌కు రావొద్దని పేర్కొంది. ఏదైనా అవసరమైతే ఈమెయిల్ ఐడీ ద్వారా లేదా ఎమర్జెన్సీ ఫోన్ నంబర్ o96176860128 ద్వారా బీరుట్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

## కాంగ్రెస్ హయాంలో ఒక్క కిలోమీటర్‌కూ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేయలేదు




58 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం ఒక కిలోమీటర్ ట్రాక్‌కు కూడా వారు ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ నెలకొల్పలేదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ అన్నారు. ప్రయాణీకుల భద్రతను గాలికొదిలేసిన వారు ఇప్పుడు సభలో అరుపులతో గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అశ్వనీ వైష్ణవ్ గురువారం లోక్‌సభలో మాట్లాడుతూ విపక్ష సభ్యుల తీరును ఎండగట్టారు. మమతా బెనర్జీ రైల్వే మంత్రిగా పనిచేసిన సమయంలో రైలు ప్రమాదాలు 0.24 శాతం నుంచి 0.19 శాతానికి తగ్గాయని చెప్పగానే బల్లలు చరిచారని, తాము రైలు ప్రమాదాలను 0.19 శాతం నుంచి 0.3 శాతానికి తగ్గించినా తమను నిందిస్తున్నారని, ఈ రకంగా దేశాన్ని నడపగలమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో తన ట్రోల్ ఆర్మీతో తప్పుడు విషయాలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ తన దుష్ప్రచారంతో రైల్వేల్లో ప్రతిరోజూ ప్రయాణించే 2 కోట్ల మంది ప్రజల గుండెల్లో గుబులు రేపుతోందని, ప్రయాణీకులను భయపెట్టడమే ఆ పార్టీ ఉద్దేశమా అని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రశ్నించారు. రైళ్లలో మూడింట రెండు వంతుల నాన్ ఏసీ కోచ్‌లు, మూడోవంతు ఏసీ కోచ్‌లు ఉంటాయని, జనరల్ కోచ్‌లకు పెరిగిన డిమాండ్ దృష్ట్యా ప్రతి మెయిల్, ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో కనీసం 4 జనరల్ కోచ్‌లు ఉండేలా చూస్తామని చెప్పారు. ఇందుకోసం 2500 జనరల్ కోచ్‌లు త్వరలో సిద్ధమవుతాయని మంత్రి తెలిపారు.

# కేసీఆర్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందే కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

కూర్చో కూడదనే కేసీఆర్ సభకు రావడం లేదు. మైక్ ఇస్తే శాపనార్థాలు.. ఇవ్వకపోతే పోడియం దగ్గర నిరసనలు చేస్తున్నారు. నేను చెల్లెలు జైల్లో ఉంటే రాజకీయాల కోసం బజార్‌లో తిరిగేవాడిని కాదు. దొర పన్నిన కుట్రలో మా అక్కలు బందీ అయ్యారు" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**బీఆర్ఎస్ నేతలకు దేవుడు జ్ఞానం ప్రసాదించాలి..**

"అక్కల క్షేమం కోరే చెబుతున్నా... వాళ్ల ఉచ్చులో పడొద్దు. దళిత బిడ్డలు సంతోషపడే రోజు వస్తే నిలబడాల్సిన అవసరం ఉంది. కానీ ప్రధాన ప్రతిపక్షం వాకౌట్ చేసి వెళ్లిపోయింది. అందుకే వాళ్ల నుంచి ఏమైనా ఆశిస్తే.. కుక్క తోక పట్టుకుని గోదారి ఈదినట్టే. వాళ్లకు దేవుడు జ్ఞానం ప్రసాదించాలని కోరుకుంటున్నా. సాయంత్రం స్కిల్స్ యూనివర్సిటీ భూమిపూజకు రావాల్సిందిగా అందరినీ కోరుతున్నా. బీఆర్ఎస్ నేతలకు రాజకీయ ప్రయోజనం తప్ప.. ప్రజల ప్రయోజనం పట్టదు. రైతు రుణమాఫీపై చర్చ జరగకూడదని బీఆర్ఎస్ నేతలు ఆడబిడ్డలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. స్కిల్స్ యూనివర్సిటీపై చర్చ జరగకూడదని అడ్డుకోవాలని చూస్తున్నారు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వర్గీకరణపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు..**

మరోవైపు.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 23న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దామోదర రాజనర్సింహ అడ్వకేట్ జనరల్‌ను సుప్రీంకోర్టుకు పంపించారని అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో న్యాయ నిపుణులతో వాదనలు వినిపించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.



**మా ప్రయత్నం ఫలించింది..**

తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఇప్పుడు అమల్లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్‌లో కూడా మాదిగ, మాల ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని అన్నారు. ఇందుకోసం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకువస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు.

**అందుకే దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది**

వృత్తి నైపుణ్యం లేకపోవడం వల్ల దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకే అందరికీ అన్ని రకాల నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేబోతున్నామని ప్రకటించారు. ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు తీసుకువచ్చి.. వ్యవసాయం, విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని సీఎం వ్యాఖ్యానించారు. రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. గురువారం నాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.

**నైపుణ్యం ఉన్నవారి కొరత ఉంది..**

దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇచ్చి ప్రోత్సహించారని వివరించారు. దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చారని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లో ఐటీ రంగ అభివృద్ధికి ఆనాడు రాజీవ్ గాంధీ పునాదులు వేశారని గుర్తుచేశారు. ప్రపంచంలో మార్పులకు అనుగుణంగా మన విధానాల్లో కూడా ఆ మార్పులు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రపంచంలో నైపుణ్యం ఉన్నవారి కొరత ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

**17 కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం**


"యంగ్ ఇండియా పత్రిక మహాత్మాగాంధీ మొదలు పెట్టారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోబోతున్నాం. లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పించడమే స్కిల్స్ యూనివర్సిటీ ఉద్దేశం. స్కిల్స్ యూనివర్సిటీపై ప్రధాన ప్రతిపక్ష నాయకులు సూచనలు ఇస్తే సంతోషించేవాళ్లం. కానీ వారు సభకు రాలేదు.. వచ్చిన వారు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. స్కిల్స్ యూనివర్సిటీలో 17 కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం. స్కిల్స్ యూనివర్సిటీలో కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్స్ అందించాలని నిర్ణయం తీసుకున్నాం. ఏడాదికి రూ.50వేలు నామమాత్రపు ఫీజుతో కోర్సుల శిక్షణ అందించనున్నాం. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉచితంగా అందిస్తాం. ఈరోజు సాయంత్రం స్కిల్స్ యూనివర్సిటీకి భూమిపూజ చేసుకోబోతున్నాం. ఈ సంవత్సరం 6కోర్సులకు రెండువేల మందికి అడ్మిషన్స్‌కు అవకాశం ఇస్తున్నాం. శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేందుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయి. భవిష్యత్‌లో జిల్లాల్లోనూ కళాశాలలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే ఆలోచన చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నేడు అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్

-మొదటిపేజీ తరువాయి

చేయాలని కేబినేట్ చర్చించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసేందుకు రెవెన్యూ శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, సివిల్ సప్లయిస్ మంత్రితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. త్వరలోనే అర్హులైన పేదలందరికి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని మంత్రి ప్రకటించారు.

క్రీడాకారులు ఈషా సింగ్, నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో 600 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు గ్రూప్ -1 స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇటీవల విధి నిర్వహణలో మరణించిన ఇంటెలిజెన్స్ డీజీ రాజీవ్ రతన్ కుమారుడు హరి రతన్‌కు మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం ఇవ్వాలని కేబినేట్ తీర్మానించింది. ఇటీవల విధి నిర్వహణలో చనిపోయిన అడిషనల్ డీజీ మురళి కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది. ఇటీవల రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వానికి తిరిగి పంపించిన ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి కేబినేట్ చర్చించింది. తిరిగి ఇద్దరి పేర్లను గవర్నర్ ఆమోదానికి పంపించాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రెండో విడతగా చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. అవసరమైతే ఇథనాల్, విద్యుత్తు ఉత్పత్తికి అక్కడి ఫ్యాక్టరీల్లో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చర్చించింది. ఇండస్ట్రీస్ మినిస్టర్ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ బాధ్యతలు అప్పగించింది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని శామీర్‌పేట చెరువు నింపి, అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు తరలించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలతో చెరువులు నింపి, మిగతా నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# కాక రేపుతున్న బీజేపీ అధ్యక్ష పదవి



**హైదరాబాద్ :** బీజేపీలో అధ్యక్ష పదవి కాక రేపుతోంది. అధ్యక్షులు ఎవరు ఈటల రాజేందరా..? డీకే ఆరుణా..? రోజుకొక పేరు తెరమీదకు వస్తుండటంతో ఢిల్లీ పెద్దలు ఎవరికి పగ్గాలు అప్పజెపుతారన్నది అంతుపట్టడం లేదు. ఇంతకీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై అంత చర్చ ఎందుకు?.. అధ్యక్ష పదవికి పార్టీలో కొత్తగా చేరిన నేతలు పనికి రారా..? పాత నేతలే ఉండాలనే రూల్ ఉందా..? లేక నరనరాన మత భక్తి నింపుకుంటేనే పదవులుంటాయా..? అందుకు బండి సంజయ్, కిషన్ రెడ్డిలే నిదర్శనమా..? రాష్ట్ర బీజేపీలో అధ్యక్ష పీఠం పంచాయితీ మరింత ముదురుతోంది. పార్టీ రాష్ట్ర కార్యలయం దాటి ఢిల్లీ వినువీధుల్లో అధిష్టాన పెద్దలతో కుస్తీ పడుతోంది. అధ్యక్ష రేసులో నిన్నటి దాకా కొత్త పాత నేతల పేర్లు వినిపించాయి. నేడు అది వార్ వన్ సైడ్ అన్నట్టు కొత్త నేతల పేర్లే ఫోకస్ అవుతున్నాయి. అధ్యక్షపగ్గాలు చేపట్టడానికి మాకేం తక్కువ అన్నట్టు మొన్నటి దాకా అందరు పోటీ పడి ఎవరికి వారు పైరవీలు చేసుకోవడంలో బిజీబిజీగా ఉండిపోయారు. కానీ పాత కొత్త నేతల పంచాయితీ రాష్ట్ర బీజేపీలోనే కాదు ? ఢిల్లీ పెదలకు కూడా గందరగోళంగా తయారైన నేపథ్యంలో పాత బీజేపీ నేతలంతా డైలామాలో పడినట్లు తెలుస్తోంది.

జాతీయ స్థాయిలో మోడీ, అమిత్ షా వర్సెస్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, నితిన్ గడ్కారీల మధ్య బీజేపీలో గ్రూప్ వార్ నడుస్తోంది. మోడీ, అమిత్ షాలు ఆర్ఎస్ఎస్‌కు పార్టీలో ప్రాధాన్యత తగ్గించాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మోడీ క్రేజీ తగ్గుతున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ అప్రమత్తం అవుతోందంటున్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో బీజేపీకి సోలో మెజార్టీ రాకపోవడంతో మోడీ క్రేజ్ తగ్గిందనడానికి అదే నిదర్శనమన్న వాదన ఆర్ఎస్ఎస్ వినిపిస్తుంది. అందులో భాగంగానే మోడీ అమిత్ షాలు ఒకవైపు ఆర్ఎస్ఎస్ ఒకవైపు అన్న చందంగా బీజేపీ పరిస్థితి మారిందంట.ఆర్ఎస్ఎస్ నేతలంతా ఒకవైపు, నాన్ ఆర్ఎస్ఎస్ నేతలంతా మరోవైపు అన్నట్టుగా డిల్లి తరహా వ్యవహారమే రాష్ట్ర బీజేపీలో కనిపిస్తోంది. అందుకు నిదర్శనం పాత నేతలైనా కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మాత్రమే మంత్రి పదవులు ఇచ్చి, మిగతా పార్లమెంట్ సభ్యులకు మొండి చేయి చూపించడమే అంటున్నారు. అది మిగితా సభ్యులకు తెలిసినా అవకాశం వచ్చే వరకు బీజేపీని అంటిపెట్టుకుని ఉండాలని భావిస్తున్నారంట. కొత్తగా పార్టీలో చేరి ఎంపీలైన నేతలు తమకు పార్టీ పరంగా అవకాశం రాకపోతే కచ్చితంగా తమ భవిషత్ చూసుకునే పరిస్థితి కనిపిస్తుందంటున్నారు.ఇక మరోవైపు కొత్త నేతలకే రాష్ట్ర అధ్యక్ష పదవని తేలడంతో ఆ పంచాయితి కొత్త నేతల మధ్య కాక రేపుతోంది. ఈ అధ్యక్ష పంచాయితిని చూడలేక సీనియర్ నేతలెవరు పార్టీ కార్యాలయ మెట్లు ఎక్కడానికి ఇష్టపడటం లేదంట. ప్రధానంగా అధ్యక్ష రేసులో ఈటల రాజేందర్, డీకే ఆరుణ పేరు బలంగా వినిపిస్తుండటంతో అధ్యక్ష పదవి కోసం అశ పడ్డ మిగిలిన నేతలంతా అసంతృప్తితో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆ క్రమంలో అధికార ప్రతినిధులెవరు కూడా బీజేపీ పార్టీ ఆఫీస్ ధరి దాపుల్లో కనిపించడం లేదు.అధ్యక్ష పదవి ఎవరికి అన్నది అటుంచుతే కొత్త పాత నేతల పంచాయితీని తట్టుకోలేకే గతంలో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, మజితేందర్ రెడ్డి, ఎన్నెం శ్రీనివాస్ రెడ్డి, విజయశాంతి, వివేక్ వెంకటస్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి, మధుసుదన చారీలతో పాటు చాల మంది పార్టీకి దూరమయ్యారు. గతంలో వారి విషయంలో పాత నేతలంతా గుర్రుగా వుండి, టార్గెట్ చేసి పార్టీ నుంచి వెళ్లేలా చేశారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కూడా అదే తంతూ కొనసాగుతోంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలను పార్టీ పాత నేతలు టార్గెట్ చేస్తుండటంతో ఆ పార్టీలో ఎవరు ఉండటానికి ఇష్ట పడటం లేదు.ప్రస్తుతం అధ్యక్ష పదవి గనక కొత్త నేతలకు ఇస్తే సహించేది లేదని, సంఘ్ పరివారులు తేల్చిచెప్తున్నారు. అయితే తమ నేతలకే అధ్యక్ష పీఠం దక్కుతుందని ఈటల, డీకే వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. దాంతో ఆ పంచాయతీ పార్టీ శ్రేణులకే అంతుపట్టకుండా తయారైంది. మొత్తమ్మీద అధ్యక్ష పదవి కొత్త నేతకా లేక మత భక్తి నింపుకున్న పాత నేతకా అనేది చర్చనీయంశంగా మారింది.

## బ్యాంక్‌లో అక్రమాలు..




-మొదటిపేజీ తరువాయి

పాల్పడినట్లు ప్రాథమికంగా తేలింది. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు విషయాలు మరిన్ని బయటపడే అవకాశాలు ఉన్నాయి. బ్యాంక్‌కు సంబంధించిన నిధులను భారీగా దారిమళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈడీ అధికారులు మహేష్ బ్యాంక్‌లో సోదాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

**ఈడీ అధికారులు ఏమన్నారంటే..**

హైదరాబాద్‌లోని మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో భారీ అక్రమాలు జరిగాయని ఈడీ అధికారులు స్పష్టంచేశారు. రెండు రోజుల పాటు బ్యాంక్‌లో సోదాలు చేసినట్లు తెలిపారు. ఈ సోదాల్లో కోటి రూపాయిల నగదుతో పాటు 5 కోట్ల రూపాయిల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అనర్హులకు రూ.300 కోట్ల రుణాలు ఇచ్చినట్లు గుర్తించామని తెలిపారు. 1800 మందికి డమ్మీ గోల్డ్‌లోన్స్ ఇచ్చినట్లు తమ సోదాల్లో తేలిందన్నారు. పలు రుణాలకు తక్కువ వడ్డీ వసూలు చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. రుణాలన్నీ బినామీల పేర్లతో కుటుంబసభ్యులే తీసుకున్నారన్నారు. బ్యాంక్‌లోని డబ్బు వివిధ మార్గాల ద్వారా పక్కదారి పట్టిందని ఈడీ తెలిపింది. తప్పుడు ఆస్తి పత్రాలతో భారీ రుణాలు మంజూరు చేశారని, వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన పలు ఆస్తులకు లోన్స్ ఇచ్చారని ఈడీ పేర్కొంది.

**గత రెండు రోజులుగా..**

మహేష్ కో-ఆపరేటీవ్ బ్యాంకులో రూ.300 కోట్ల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసులో బ్యాంకు ప్రమోటర్ల ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఆరు వేర్వేరు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. నకిలీ పత్రాలు సృష్టించడం, నిబంధనలకు విరుద్ధంగా రూ.300 కోట్లకుపైగా రుణాల మంజూరు, బ్యాంకు నుంచి రూ.18.30 కోట్లు దారి మళ్లింపు ఆరోపణలపై ఈడీ విచారణ చేస్తోంది. దీనిలో భాగంగా బ్యాంకు ఛైర్మన్ రమేష్ కుమార్ బంగ్, వైస్ ఛైర్మన్ పురుషోత్తమదాస్, ఎండీ ఉమేష్ చంద్‌కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేసిన ఈడీ బృందాలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సేకరించిన విషయం తెలిసిందే.

## వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధులు

**హైదరాబాద్ :** తెలంగాణలో ఈ ఏడాది భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలపై డెంగ్యూ ప్రభావం ఉన్నట్లు సమాచారం. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి, నిలోఫర్ లో డెంగ్యూ జ్వరాలతో వస్తున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. డెంగ్యూ ఫీవర్ పట్ల నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఐదారు రోజులకు పరిస్థితి విషమిస్తుందని హెచ్చరిస్తున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ నివేదిక ప్రకారం తెలంగాణలో జులైలోనే 722 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు మొత్తం 1800 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. జనవరి నుంచి జూన్ వరకు 1,078 డెంగ్యూ కేసులు నమోదవ్వగా... జులై చివరి నాటికి ఈ సంఖ్య 1,800కి పెరిగింది. వీటిలో 60 శాతం కేసులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నమోదయ్యాయి. మిగిలిన కేసులు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో రికార్డు అయ్యాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా డెంగ్యూ కేసుల్లో తగ్గుదల కనిపిస్తుంది. 2019లో 13,331 కేసులు, ఏడు మరణాలు రికార్డు కాగా, 2020లో 2,173 కేసులు, 2021లో 7,135 కేసులు. 2022లో 8,972 కేసులు, మరియు 2023లో 8,016 కేసులు, ఒక మరణం నమోదయ్యాయని లెక్కలు చెబుతున్నాయి.తెలంగాణ వ్యాప్తంగా డెంగ్యూ కేసుల్లో జీహెచ్ఎంసీ పరిధిలోనే 60 శాతం కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ బాధితుల నుంచి ప్లేట్లెట్ కోసం అభ్యర్థనలు పెరుగుతున్నాయని బ్లెడ్ బ్యాంకుల నిర్వాహకులు తెలిపారు.అకస్మాత్తుగా హై ఫీవర్ రావడం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కంటి కదలికతో నొప్పి తీవ్రమవుతుండడం, కండరాలు, కీళ్ల నొప్పులు, రుచి, ఆకలి లేకపోవడం, ఛాతీ, శరీరంపై దద్దుర్లు, వికారం, వాంతులు, రక్తపు వాంతులు, ముక్కు, నోరు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, నిద్రలేమి, దాహం అనిపించడం, నోరు ఎండిపోవడం, పల్స్ పడిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిదోమల ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించేందుకు ముందు జాగ్రతలు తీసుకోవాలి. పొత్తికడుపు నొప్పి, వాంతులు, రక్తస్రావం వంటి తీవ్రమైన లక్షణాల ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇంటి లోపలకు దోమలు రాకుండా దోమ తెరలను ఉపయోగించాలి. బయట ఉన్నప్పుడు పొడవాటి దుస్తులు ధరించండి. ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.వర్షాలు పెరిగే అవకాశం ఉందని, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. తలుపులు, కిటికీలకు దోమతెరలు అమర్చుకోవాలని, ఉదయం, సాయంత్రం దోమలు ఎక్కువగా ఉండే సమయాల్లో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలని సూచించింది. సెప్టిక్ ట్యాంకులను కప్పి ఉండాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు తెలిపారు. ఇళ్ల చుట్టూ నిలిచిన నీటిని తొలగించడానికి వారానికోసారి "ఫ్రైడే డ్రై డే" పాటించాలని అధికారులు సూచించారు.

## కాంగ్రెస్ సభ్యుల ముఖాల్లో రాక్షసానందం..

## మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మేం ముగ్గురం మహిళా ఎమ్మెల్యేలం సభలో నిల్చొని ఉంటే.. అయ్యో పాపం అనాల్సింది పోయి.. కాంగ్రెస్ సభ్యుల ముఖాల్లో రాక్షసానందం కనిపించిందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలులు సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మితో కలిసి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఎనిమిది నెలలు అవుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్యం, ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన, సోనియా నాయకత్వం అని ఊదరగొడుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రజా పాలన అంటే ఎలా ఉంటుందో మార్పు తీసుకొస్తారన్న నమ్మకంతో ఆడబిడ్డలందరూ కాంగ్రెస్‌కు ఓటేశారు. గ్యాస్ సబ్సిడీ, మహిళలకు నెలకు రూ. 2500 వంటి హామీలకు ఆడబిడ్డలు ఆకర్షితులై గెలిపించారు. కానీ రాష్ట్రంలో ఏం జరుగుతుంది.. రోజు ఉదయం లేస్తే ఏ టీవీలో ఏం వార్త కనిపిస్తుందో, ఏ పేపర్‌లో ఏ వార్త చదవాల్సి వస్తుందో అని అమ్మాయిల తల్లిదండ్రులు వణికిపోతున్నారు. మహిళల మీద జరుగుతున్న అత్యాచారాలపై మొన్న అసెంబ్లీలో మాట్లాడిన 48 గంటల్లోపే హైదరాబాద్ నగరంలో ఐదుగురిపై అత్యాచారం జరిగింది. కానీ ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. కనీసం ప్రభుత్వం నుంచి స్పందన లేదు అని సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. అత్యాచార ఘటనలపై మాట్లాడుదామని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అంటే నాలుగున్నర గంటలు నిలిచి ఉంటే కూడా కనీసం మైక్ ఇవ్వడానికి భయపడుతున్నారు. ఎందుకు ముఖ్యమంత్రికి భయం. ఆడబిడ్డలకు మైక్ ఇస్తే వాస్తవం మాత్రమే మాట్లాడుతారు. తిమ్మినిబమ్మిని చేసే శక్తి మాకు లేదు. కనీసం మైక్ ఇవ్వలేదు. సీఎంగా రేవంత్ ఉన్నప్పుడు అసెంబ్లీలో ముగ్గురు ఆడబిడ్డలు నాలుగున్నర గంటల పాటు నిలబడి ఉంటే కూడా మైక్ ఇవ్వలేదనే మాట చరిత్రలో ఉండిపోతుంది. ఆ సీటు వైపు చూస్తుంటే.. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ గుర్తుకు వచ్చారు. ఇవాళ వీరందరూ కనిపించారు. ఆడబిడ్డలు నిల్చున్నారు వారికి అవకాశం ఇవ్వండి అని వారు అనేవారు. మిగతావి తర్వాత మాట్లాడుదాం అనేవారు. కానీ ఇవాళ మేం నిల్చుంటే కాంగ్రెస్ సభ్యుల ముఖాల్లో రాక్షసానందం కనిపించింది. ఆశ్చర్యమేసింది. ఒక్కరు కూడా అవమానంగా ఫీల్ కాలేదు.. వారి రాక్షసానందం చూస్తే బాధ అనిపించింది అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

# చిట్కుల్'లో ధూంధాం గా పలారం బండి వేడుకలు

- అలరించిన శివవేష దారుల,పోతురాజుల విన్యాసాలు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు
- అదిరిపోయేలా ఏర్పాట్లు చేసిన ఎన్ఎంఆర్ యువసేన
- ముఖ్య అతిథిగా హాజరైన నీలం మధు ముదిరాజ్

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి చిట్కుల్లో జరిగే దుర్గమ్మ జాతర తో పాటు బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలలో రెండవ రోజు ఎన్ఎంఆర్ యువసేన చిట్కుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి వేడుకలు ధూంధాం గా జరిగాయి. ఈ పలహారం బండి వేడుకలకు ఎన్ఎంఆర్ యువసేన భారీ ఏర్పాట్లను చేసింది. సాయంత్రం ఏడు గంటలకు నీలం మధు నివాసం నుంచి ప్రారంభమైన పలహారం బండి ఊరేగింపు చిట్కుల్ పూరవీధుల మీదుగా సాగింది. ఫలహారం బండి ముందు ఏర్పాటుచేసిన ప్రత్యేక లైటింగ్,డీజే సౌండ్ ఆకటుకున్నాయి. ఈ వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేకంగా రప్పించిన కేరళ కళాకారుల నృత్యాలు, డిజె సౌండ్ లోని పాటలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫలహారం బండి ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు చూపరులను లను అలరించాయి. ఉత్సవాల్లో ఏర్పాటుచేసిన బాణసంచా పేలుళ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలారం బండి పై అమ్మవారి ప్రతిమను ఉంచి ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న సమయంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ధూమ్ ధామ్ గా ఆనందోత్సవాలతో డాన్సులు చేస్తూ జై మాతాది నినాదాలతో హోరెత్తించారు. ఈ ఫలహారం బండి ఊరేగింపులో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# క్రికెట్‌లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాణించాలి: ఏసిపి రవికుమార్

**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** క్రికెట్ లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభతో రాణించాలని బెల్లంపల్లి ఏ.సి.పి. రవికుమార్ అన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం స్థానిక నెంబర్ 2 క్రీడామైదానం లో జిల్లా స్థాయి అండర్ 19, అండర్ 23 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను ప్రారంభించిన ఏ.సి.పి మాట్లాడుతూ ఐ.పి.ఎల్ లాంటి పోటీలు ఎంతో ప్రాచుర్యం పొందాయని అలాంటి పోటీల్లో ఈ ప్రాంతం నుండి క్రీడాకారులు పాల్గొనడానికి కృషి చేసి విజయం సాధించాలని అయన కోరారు.ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్ పోటీలకు ఎంపికచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నేతలు నాతరి స్వామి, బండి ప్రభాకర్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, కోచ్ లు జాడి శేఖర్, అల్లం గౌతమ్, పి.ఈ.టి లు ఇమ్మానియాల్, అజీజుద్దీన్, కె. శ్రీకాంత్, గోకుల్ పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణకు రిజర్వేషన్లు హర్షం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

- మంద కృష్ణ మాదిగకు పాలాభిషేకం

**వాస్తవ నేస్తం,బోనకల్:** మంద కృష్ణ మాదిగ అన్న ఎస్సీలుగా ఉన్నటువంటి ఉమ్మడి రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలని లక్ష్యంతో గత 30 సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం కొనసాగిస్తున్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం వివిధ రూపంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపై వర్గీకరణను డిమాండ్ తో ప్రభుత్వాలు వివిధ కమిషన్లు వర్గీకరణకు అనుకూలత తెలపటం అయినా ప్రభుత్వాలు అమలులో నిర్లక్ష్యాలు వహించడం కృష్ణ మాదిగ తీవ్రమైన ఉద్యమాన్ని ఉద్యమా రూపంలో పోరాటం చేసి ఈరోజు ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో ఉండటం ఆ యొక్క అంశం ఏడుగురు సభ్యులు గల తీర్పు ఎస్సీలు ఎస్టీలు వర్గీకరణకు వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చు అనుకూలమైన తీర్పును ఎమ్మార్పీఎస్ శ్రేణులు ఆశిస్తూ బోనకల్ మండల పరిధిలో మందకృష్ణ మాది గారి పాలాభిషేకం నిర్వహించి టపాసులు పేల్చి ఎమ్మార్పీఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల నిరంతర పోరాటం అనుకూలమైన తీర్పురావటం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు మాదిగ,జిల్లా సీనియర్ నాయకులు తాటికొండ వెంకటరత్నం మాదిగ,కోట హనుమంతరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తోటపల్లి చిన్న సైదులు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి బలవంతపు నరసింహారావు మాదిగ,మర్రికంటి గంగాధర్ మాదిగ, మండల నాయకులు మంద అశోక్ మాదిగ, మర్రి కరణం మాదిగ,వేల్పుల అర్జున్, తాళ్లూరి ప్రకాశం, పాటిబండ్ల నవీన్ మరియు ఎమ్మార్పీఎస్ శ్రేయోభిలాషులు గద్దల వెంకటేశ్వర్లు, చిలక నాగభూషణం, కోట కొండ, వెంగళ కనకయ్య, తాళ్లూరి సురేష్, తోటపల్లి సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం: శ్రీధర్ బాబు

**హైదరాబాద్ :** అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జాబ్ క్యాలెండర్ ద్వారా రాబోయే రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. శాసన సభలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లును మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశ పెట్టారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ స్థాపనకు ప్రతిపాదిస్తున్నామని, రెండు లక్షల ఉద్యోగాలు కల్పించడంతో పాటు మరో 20 లక్షల మందికి ఉపాధి కోసం ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రభుత్వం పరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు గ్రాడ్యుయేట్లలో కొరవడ్డాయని, నైపుణ్యాల పెంపుపై పారిశ్రామికవేత్తలు, విసిలు, విద్యార్థులతో చర్చలు జరిపామన్నారు.

## 18 యూ ట్యూబ్ చానెల్స్‌పై బ్యాన్

**హైదరాబాద్ :** అసత్య వార్తలను ప్రచారం చేస్తోన్న కొన్ని యూట్యూబ్ ఛానళ్లను మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఇటీవల రద్దు చేసింది. హీరోహీరోయిన్లను విమర్శిస్తూ చేసిన వీడి యోలను, కామెంట్లను 48 గంటల్లోగా తొలగించాలంటూ డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు మా అధ్యక్షుడు మంచు విష్ణు విజ్ఞప్తి చేశారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై నటి మీనా స్పందించారు. మంచు విష్ణుకు థ్యాంక్స్ చెబుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. మా తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన పోస్ట్‌ను షేర్ చేసిన మీనా తప్పుడు కంటెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తున్న యూట్యూబ్ ఛానళ్లపై యాక్షన్ తీసుకున్న మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కు, అధ్యక్షుడు

## బీ కేటగిరి సీట్ల భర్తీకి నోటిఫికేషన్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో బి-కేటగిరీ అంటే యాజమాన్య కోటా కింద ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి రాష్ట్ర ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జులై 31 సాయంత్రం సీట్ల భర్తీకి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 9వ తేదీలోపు నోటిఫికేషన్ జారీ చేసి, నోటిఫికేషన్ విడుదల తర్వాత దరఖాస్తు చేసుకోవడానికి కనీసం ఆరు రోజులు గడువు ఇస్తున్నట్లు విద్యామండలి పేర్కొంది. ఆగస్టు 29లోపు సీట్ల భర్తీ చేసేందుకు ప్రణాళిక రూపొందిం చింది. బీ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థుల పూర్తి వివరాలను సెప్టెంబరు 10వ తేదీలోపు తమకు సమర్పించాలని ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలను ఆదేశించింది.కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1.11 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉంటే.. అందులో 30 శాతం సీట్లను యాజమన్యం కోటా కింద భర్తీ చేయనున్నారు. ఇందులో 15 శాతం ఎన్ఆర్ఐలకు కేటాయిస్తారు. ఈ కోటా కింద సీట్లు పొందిన విద్యార్థులు ఎన్ఆర్ఐలు సిఫార్సు చేసిన వారై ఉండాలి. మిగిలిన 15 శాతం సీట్లను తొలుత జేఈఈలో ర్యాంకు ఆధారంగా, తర్వాత ఎంసెట్ ర్యాంకు ఆ ధారంగా భర్తీ చేస్తారు. ఈ కోటా కింద ప్రవేశాలు పొందేవారు సంబంధిత సబ్జెక్టుల్లో 45 శాతం కనీస మార్కులు కలిగి ఉండాలి. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల గడువును ఆగస్టు 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా ఓ ప్రకటనలో తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



**వాస్తవ నేస్తం,భీంపూర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గురువారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇలా మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని..సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సబితా ఇంద్రారెడ్డి,సునీత లక్ష్మరెడ్డిని మాత్రమే అవమణించలేదని యావత్ మహిళా లోకాన్ని అవమానించారని.కేసీఆర్ పదేళ్ల పాలనలో ఇటువంటి సందర్భం జరగలేదన్నారు.వెంటనే మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎస్సై మొహమ్మద్ కలీం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ సంజీవ్ రెడ్డి,మాజీ సర్పంచ్లు మడావి లింబాజి,సయ్యద్ బాదర్, నాయకులు షేక్ అఫ్రోజ్,బొంత నితిన్,మార్చెట్టి అనిల్, జహూర్ అహ్మద్,షేక్ రౌఫ్,ధరం సింగ్,రవీందర్ జాదవ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ముందు బీజేపీ నాయకుల ధర్నా



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** అర్హులైన రైతులకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ జరగలేదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ అధికారులు రైతు రుణమాఫీ చేసిన వివరాలను సక్రమంగా రైతులకు అందజేయడం లేదని ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని బ్యాంకు అధికారులను నిలదీశారు. ఆగస్టు 15లోగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీ వివరాలను రైతులకు అందజేయకపోతే బ్యాంకు ఎదుట మండల రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహిస్తామని బ్యాంక్ అధికారులను హెచ్చరించారు. బ్యాంకులో బ్రోకర్ వ్యవస్థను మానుకొని స్వయంగా బ్యాంక్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు కేంద్రే శివాజీ, మాజీ వైస్ ఎంపీపీ భరత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఉత్తం, బీజేవైఎం మండల అధ్యక్షుడు జాదవ్ రాజేంద్రప్రసాద్, నాయకులు జాలీం, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని తోషం గ్రామం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు ఆసక్తి గల మహిళ అభ్యర్థులు మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ వాచ్ ఉమెన్ దరఖాస్తు చేసుకునే మహిళ అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. వయస్సు 25 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల వరకు ఉండాలన్నారు.నైట్ వాచ్ ఉమెన్ కోసం దరఖాస్తు ఈనెల మూడవ తేదీన ఎంఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

## ఎస్టీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అంగడి బాలరాజు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్టి మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా అంగడి బాలరాజును నియమించింది, ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా చీఫ్ డాక్టర్ కళ్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు, ఈ సందర్భంగా అంగడి బాలరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్టి మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమించినందుకు పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## బోనకల్ మండల అదనపు ఎంపీడీవో గా వివి సుబ్రమణ్య శాస్త్రి



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిషత్ అదనపు అభివృద్ధి అధికారిగా(ఎంపిడిఓ )మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) గా పనిచేస్తున్న వి వెంకటసుబ్రమణ్య శాస్త్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన లకావత్ రాజు తన యొక్క పదవి విరమణ దృష్ట్యా తాను వ్యక్తి గత సెలవులపై వెళ్లడంతో ఎంపీఓ వి సుబ్రహ్మణ్య శాస్త్రిని మండల అదనపు పూర్తిస్థాయి ఎంపీడీవో గా కలెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com